పెరిగి పెళ్ళయి అత్తవారింటికి కూడా వెళ్ళిపోయింది. "ఏవిటే వెర్రి పాటలూ నువ్వూనూ" అని ఆ పిల్ల తల్లి మీద విసుక్కునేది. తన తల్లి సంగీత సాధన ఆ యింటి అల్లుడుగారెక్కడ వింటాడోనని ఆ అమ్మాయి హడిలిపోయేది. హార్మణీని దాచటం శక్యంకాక తన పడగ్గదిలో పందిరి మంచం కింద కొన్నాళ్లుంచింది.

ఈ ఒక్క పిల్లా కాపరాని కెళ్లాక మా అత్తయ్యకు మళ్లీ కడుపొచ్చినట్టు అనుమానం కలిగింది. మగపిల్లాడు పుడ్తాడేమోనని ఆవిడ సంతోషంతో అవీ యివీ చేసుకుని తినటం మళ్ళీ పాటలు పాడ్డం మొదలెట్టింది. ఆవిడ చాలా హడావిడి చేశాక లేడీ డాక్టరు కడుపూ కాదూ కాలూ కాదునోరుమూసుకోమని చెప్పింది. అది చాలా పెద్ద షాక్-ఆవిడ దిగాలు పడిపోయింది. కూతురొచ్చి చివాట్లేసింది. ఆవిడలాగే ఆ హార్మణీ కూడా చాలా పాతబడి ముసలిదై పోయింది. నల్ల మెట్లేవో తెల్ల మెట్లేవో తెలుసుకోవడం కష్టం. హార్మణి తిత్తికిచిల్లులు పడిపోయాయి. అందులోకి గాలి దూరి వికృతమైన శబ్దాలు వస్తున్నాయి. మా అత్తయ్యకి కడుపులో కేన్సరన్నారు. ఆవిడ బాగా లావెక్కి అదోలా తయారయింది. ఇప్పుడెవరేనా సూరీడూ ఒక పాట పాడూ అంటే ఆమె కళ్ళలో మెరిసేతళుకు చూస్తే చాలు వెంటనే ఆవిడ కళ్ళలో నీళ్లు తిరుగుతాయి. హార్మణీ బాగుచేయించమని ఆవిడ మొగుడ్ని వేధిస్తుంది. చూద్దాంలే అంటాడతను మీ అమ్మాయికి హార్మణీ చెప్పిస్తున్నారా అని అడుగుతుంది. వాళ్లు లేదంటే వాళ్లతో సరిగా మాట్లాడదు, మొన్నీమధ్య ఆ హార్మణీ పెట్టెలో ఒక ఎలక పన్నెండు పిల్లల్ని పెట్టింది. పాటల పుస్తకాన్ని చదలు తినేశాయి. ఆవమొలెట్ పెసపలు దానికో తుప్పు పట్టిన కీఫ్, అది అరిగిపోయి చిటికెన వేలంత వున్నది. ఓసారి పోరు పడలేక మావయ్య ఆ హార్మణీ షాపుకి పట్టికెళ్లి యిచ్చాడు. బాగుచేయటాని కెంతవుతుందో కనుక్కుందామని. నా హార్మణీ తీసుకురారేమని ఆవిడ ఒకటే గొడవ. ఆ షాపు ఎప్పుడు తాళం వేసుంటుందే అని అతను జవాబిచ్చాడు. ఆ షాపు వాడు పెట్రోమాక్సు లైట్లు గ్రామఫోను బాగుచేస్తాడు. హార్మణీ సంగతి వాడికి తెలీదు. ఆ నిజం వాడు వప్పుకోడు. అందుకని మా వెర్రత్తయ్య హార్మణీ ఆ షాపులో ఓ మూలపడి వెర్రి చూపులు చూస్తోవుంటుంది. దాన్నెవరు పలికించ గలరు. అది ఎట్లా పలుకుతుంది.

# సంభవంతి దినే దినే

**త**న కోపమే తన శత్రువు అన్నాడు వేమన. చచ్చాం వేమన కాదు సుమతీ శతకం చెప్పినాయన అన్నాడ్ట తన శాంతమే తనకు రక్ష అని మరొకడెవడో రహీమని అనేశాడు. శాంతమూ లేక సౌఖ్యమూ లేదూ సారస దళనయనా అన్నాడు త్యాగరాజు. రామదాసు అలాగన్లేదు. "ఎవ డబ్బా సొమ్మని కులుకుచూ తిరిగేవు రామచంద్రా" అన్నాడు. గాంధీ గారు

"క్విట్ ఇండియా" అహింసా సింహంలా గర్జించారు. 1942 ఆగష్టులో కొత్త కాంగ్రెస్ వాదు "క్విట్ పావర్టీ" అని పిల్లిలా అరిచేరు అశ్వత్థామ హతః కుంజరా అన్నట్లు. సరే దుర్వాసమహాముని కోపం జగత్ప్రసిద్ధం కదా? మునుల కోపాలన్నీ శాపాలుగా బయటపడేవి. ఆ ఒక్కొక్క శాపానికి ఒక్కొక్క కథ అల్లీ బిల్లీ అమ్మాయిలా అల్లుకుని పోయేది. రాజాజీకి కోపం వచ్చినప్పుడల్లా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని స్వరాజ్యలో రాసేసుంటారు. నిజ లింగప్పగారికి కోపం వచ్చినప్పుడల్లా సభ్యత్వాలు రద్దు చేస్తూ వుంటారు. ఇందిరమ్మకు కోపం వచ్చి నప్పుడల్లా నేషనలైజేషన్స్ పర్సుల్ని వూడలాక్కోవటమ్స్ లాటివి చేస్తూ ఉంటారు. ఇంకా కోపం తీరని మంత్రులు అధికారులు టూర్లు సేవిస్తూ వుంటారు, సినిమా వారికి కోపం వచ్చినప్పుడు ఒక సినిమాను పదిసిన్మాలుగా తీసి పారేస్తూంటారు. సెన్సారు బోర్డుకి కోపం వచ్చినప్పుడల్లా లంగా డాన్సుల్ని కట్ కట్ అంటారు. పేదవాని కోపం పెదవికి చేటన్నట్లు పదవిలో వున్న వాడి కోపం పదవికి చేటు. స్టూడెంట్లకు కోపం వస్తే సమ్మె చేస్తారు. ఇల్లాళ్లకు కోపం వస్తే గిన్నె బోర్లించేసి పొయ్యిలో నీళ్లు పోసి ఎంచక్కా సీరియల్ నవల్స్ చదువుకుంటూ మొగుడ్నుని చిల్డ్రన్స్‌ని ఎండ గట్టేస్తారు. అతగాడు అనగా మగ పురుషునికి కోపం వచ్చినప్పుడల్లా బీరు బారు మంటూ బారుకెళ్లి గీరుగ్యార్‌మనే పిల్లలకు "హా నాథా ననుబాసి పోతివా" అని బాసిపోయే భార్యకు దురన్యాయం చేస్తాడు. ద్రౌపదికి కోపం వచ్చి నిండు సభలో జరిపిన నిండు అవమానానికి జుట్టుముడి వేయనని శపథం పట్టగా భీమసేనుడు రక్త హస్తాలతో ఆమె కొప్పు ముడి వేసే వరకూ జరిగిన కథ మన కందరకూ తెలుసు. రాముడంతటివాడిని కూడా సముద్రుడు ఖాతరు చేయలేదు. బాణం తీయగానే హడలిపోయి త్రోవయిచ్చాడు. శివుడు కూడా కోపం వచ్చినపుడు తెరవటానికి మూడో కన్ను రడీగా వుంచుకున్నాడు. దేవతలందరికీ అంతో యింతో కోపం వుంది. పెద్ద దేవుళ్లు చిల్లర దేవుళ్ళను మనిషివై పుట్టమని శపిస్తూ వచ్చారు.

ఇహ మన లేడిస్లో వరసల వారిగా కోపం హెచ్చుతూ తగ్గుతూ వుంటుంది. కోడలికి అత్తను చూస్తే కోపం? అత్తకు కోడల్ని చూస్తే కోపం, ఆడబడుచు కోపం సరేసరి తండ్రికి కొడుకు మీదా, కొడుక్కి తల్లితండ్రుల మీదా, అల్లుడికి మావమీదా, మావకి షావుకారి మీదా కోపం తప్పనిసరి. జటకా వాడికి గుర్రం మీద కోపం. గుర్రానికి ఎంతకూ తరగని రోడ్డుమీద కోపం. గుమ్మంలో స్తంభానికి కట్టి పడేసే కుక్కకు లేటు మీల్సయినా ఎవరైనా పలకరించినా భొయ్యిమంటుంది. ఈ లోకంలో కోపం లేని దెవరికి? కోపం లేనివారు భూత కాలంలోకాని, వర్తమానంలోకాని పోనీ భవిష్యత్తులోకానివున్నారా? వుంటారా? ఉండగలరా? నహి నహి అదే చెప్పాల్సి వస్తుంది. తొట్లో పాపాయి కూడా పాలు సరిగా తిత్తిలోంచి రాకపోతే కోపంగా మొహం చిట్లించి అందంగా ఏడ్చేస్తుంది. లాగూ బొత్తములు పెట్టుకోలేక కుర్ర కుంక ఏడుస్తాడు. కోపాంతమందు పర్యవసానంగా దుఃఖం కలుగుతుంది.

కోపం కలిగాక కోప కారణాన్ని తల్చుకుని నవ్వే వారెవరైనా వున్నారా? ఎందుకుండరు?

ఫరెగ్జాంపుల్, మా వారే - పిచ్చికోపం తెచ్చుకుని పెడ బొబ్బలు పెట్టిజుట్టు పీక్కుని ఆ కాస్తా దిగిపోకుండానే నవ్వేస్తారు. కోపానికి ఏడుపు ముందు రావలిసుంటే నవ్వు బి ఫోర్ టైమ్‌గా వచ్చేస్తుంది. ఆలస్యంగా నవ్వడం కంటె ముందుగా కోపం తెచ్చుకుని ఆ తర్వాత తగ్గడం ఎంతో అందంగా వుంటుంది.

కళాకారులకు, రచయితలకు, మేధావులకు రాజకీయ నాయకులకు, అధికారులకు కోపం వుంటుంది. వుండాలి. కలెక్టరుగారికి కోపంవస్తుంది. డాక్టరుగారికి కోపం వస్తుంది. హీరోకి కోపం వస్తుంది. హీరోయిన్‌కి కోపం వస్తుంది. దుర్బలుడికి కోపం వస్తుంది. దురంహకారికీ కోపం వస్తుంది. అజ్ఞానికి కోపం వస్తుంది. మహా జ్ఞానులకూ కోపం వస్తుంది.

ఈ కోపాల వలన లాభాలేమన్నా వున్నాయా? రిత్విక్ ఘటక్ అనే బెంగాలీ ఫిలిం దర్శకుడు కోపం నా ఆరో ప్రాణం అన్నాడు.

కోప కారణాలున్నంత వరకూ కోపం తెచ్చుకోక పోవడం మగతనం సారీ ఆడతనం కూడా కాదుకాదు. చాలా మంది కవులు కోప కవులే. రచయితలూ అంతే. కోపం తగ్గి పోయాక అంతా మామ్మూలు మనుష్యులే. మామూలు మనుష్యులు మహానుభావులు కాజాలరు. కోపం లేకుంటే సంఘాన్ని ప్రేమించి లాలించి ముద్దుచేసి దాన్నెవరూ బాగుచేయలేరు. దానికి కోపం తెప్పించి దాన్నిచూసి నవ్వితే నవ్వగలిగితే అందులోంచి నానా రకాల బాణాసంచా వస్తుంది. సంఘానికి కోపం తెప్పించటం ప్రమాద మంటరా? కానీయండి. కోపం వస్తే గొడ్డు కూడా కొమ్ములు విసిరేస్తుంది. మనిషి ఏం తీసిపోయాడా? రాముడు కూడా రావణుడ్ని సంహరించాకే రామరాజ్యం స్థాపించాడు. అశోకుడు కూడా కళింగ యుద్ధంలో మూకల్ని తెగటార్చాకే శాంతి పతాకాన్నెత్తాడు. కోపం తీరాక వెలిసే చిరునవ్వులాంటిది శాంతి.

అయితే మా యింట్లో పచారీ సరుకులవాడితో కళింగ యుద్ధం, పాలవాడితో రామ రావణ యుద్ధం, ఇంటివారితో అహింసాయుత శాంతియుత ప్రేమ పోరాటం, రజక స్త్రీతో వస్త్రాపహరణాలకు సంబంధించిన వాగ్రూపమైన కలహం. శ్రీవారితో నిత్య సత్యాగ్రహాలు తప్పని సరిగా సంభవంతి దినే దినే! కోపమేల రాధా దయజూడవేల నాపై అన్నాడు శ్రీ కృష్ణుడు కోపనగరి సరిహద్దులు ముట్టకుమని. మనం మంచం చుట్టూ దోమతెర దించేసుకుని ముసుగెట్టి పడుకుంటే వయసూ సొగసూ అంతా "తెల్లారిపోద్ది" అంటారు కొందరు. ఆ మాటా నిజవే. దేవుళ్ళకు కోపాలొచ్చినపుడు భక్తుళ్ళను నానా ట్రబుల్సూ పెట్టి నానా యాగీ చేస్తారు. చెయ్యకపోతే దేవుడికి ఏం పవర్సున్నాయో ఎట్లా తెలుసుద్ది చైతన్య వంతమయిన జాతి తన కోపాన్ని కోపకారణాల మీద ప్రసరిస్తుంది. శాంతమూ లేక సౌఖ్యమూ లేదూ అన్నాడు గురూగారు. ఇప్పుడు శాంతంగా వుంటున్నాము కామా? మనకేమి సౌఖ్యాలు ఏడిశాయి చెప్పండి. ఈ భూమిపై సూది మోపినంత నేల కూడా రక్తం చిందకుండా ఎవరికీ ఎప్పుడూ దక్కలేదు. అహింసాయుత శాంతియుత ప్రేమ పోరాటాలు పడగ్గదుల్లో కూడా లేవు. అక్కడా

బైదిబై రక్కుకుంటారు. గిల్లుకుంటారు. అఫ్‌కోర్స్... శోషల్ జస్టిస్ వుండాలండీ! అమ్మ-పని ముండ ఎగేసింది. గంపెడు అంట్లున్నాయ్ చచ్చాంరా దేవుడా చెరోగిన్నె తోముకుందాం వస్తారా రారూ? పోనీ మీరు చింతపండంటించండి నేను పొయ్యి బూడిత్తో కొబ్బరి పీసెట్టి బరబరా బరికేస్తాను. వినపడ్డం లేదా. చెవుడా? మరో ప్రపంచం పిలిచిందా-పిలుస్తుంది పిలుస్తుంది సెల్ఫ్ హెల్ఫ్ యీజ్ ది బెస్ట్ హెల్పన్నాడు ఇంగ్లీషు వాడు. ఇదిమరో ప్రపంచం కాదా! ఆల్‌రైట్ - గో గో గో యట్వాన్స్ మైబోయ్ చింతపండు పట్టించటం కూడా రాని మహా పురుషులున్నా రండీ యీ లోకంలో - అందులో మన కంట్రీలో మన యింట్లో.... చెప్పండి. సోషలిజం ఎలా వస్తుంది? మనలో వున్న సోషలిజాన్ని బయటకు తరమకుండా వుంటే మంచిదేమో! ఏవో కూశానుగాని యీ మాటెవరికీ బోధపడి చావదు. ఈ బాత్రూంలో బల్బు కూడా సరిగా వెలిగి చావదని గత సంచికలో చెప్పానను కుంటాను. ఇప్పుడీగిన్నెల్ని బాల్చీ అనుకుని బాల్చీని గిన్నెలనుకుని తన్నేస్తే నాగతి ఏం కాను?

## బంకం ప్రిన్సిపుల్ (అను ఒక తలతిక్క సిద్ధాంతము)

కలకత్తా ఆంధ్ర సంఘం వారి సూవెనీర్ తిరగేస్తూంటే బంకం ప్రిన్సిపులని ఒక వ్యాసం కనపడింది. బంక అంటే వ్వాట్ సార్ అని మా ఎన్‌సైక్లోపీడియా గార్నడిగాను. ఎందుకంటే ప్రతి ఆడదానికి మొగుడే అట్లాసూ. మొగుడే ఎన్‌సైక్లోపీడియా, అతగాడే డిష్నరీ ఆ మహాపురుషుడే విజ్ఞాన సర్వస్వమూ అనాలి గనుక. మొగుణ్ని కాకుండా మరోకర్ని వరినైనా విజ్ఞాన కోశమని భావించి దవుట్లు అడిగితే మెడట్టుకు వీధిలోకి గెంటేస్తారు, ఛీ-ఛో...కులటా అంటూ, పాతివ్రత్యం రూల్సన్నీ పాటించినా అజ్ఞానానికి తలవంచుగుని మా బ్రహ్మదేవుణ్ని మళ్ళీ ప్రశ్నించాను బంక అంటే ఏవిటనీ.

బంకం అంటే నాన్సెన్సుట. మరైతే నాన్సెన్స్‌కి రూల్సు ఏవిటండీ అన్నాను. కాదేమొద్దూ అదో ప్రిన్సిపులనగా సూత్రం అన్నారు. అదేదో ఆ బంకసూత్ర మంటే ఏవిటో తెలుసుకోవాలని చెడ్డ తహ తహగా వుందండీ అంటే ఫుంటుందుంటుంది తగ్గవే భామా అన్నారు మొహం చిట్లించి. మొహం చిట్లించినపుడు మొగాళ్ళు (మనలా) బావుండరు.

మనం మంగళ సూత్రాల తాలూకు సూత్రాలు పెరిగిపోయినపుడు కొత్త తాడు పేనుకుంటామా లేదా? ఆల్‌రైటు అలాగే పాత సూత్రాలు పనిచేయనపుడు సాంప్రదాయాన్ని ప్రక్కకు నెట్టి కొత్త సూత్రాలను వెతుక్కుని ఆశ్రయించాలిట. మనం లేడీస్కదా - మనది మట్టి బుర్ర కదా సహజంగా అందుకని మళ్లీ అడిగాను, బుర్ర తక్కువ వాళ్ళం కదా అడిగితే తప్పేం వుందని.